# ఎస్టీపీలతో బహుళ ప్రయోజనాలు

- చెరువుల సుందరీకరణపై దృష్టి..
- కూకట్‌పల్లి నియోజకవర్గంలో సుమారు రూ.400కోట్లతో ఎస్టీపీ పనులకు శ్రీకారం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 13 : మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ)లతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేపట్టిన ఎస్టీపీ పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం బాలాజీనగర్ డివిజన్‌లోని ముళ్లకత్వ చెరువు, ఫతేనగర్‌లోని ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ పనులను అధికారులు, కార్పొరేటర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహానగరంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చెరువుల సుందరీకరణపై దృష్టిసారించామని దీనిలో భాగంగానే ప్రధాన చెరువుల వద్ద మురుగు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో సుమారు రూ.400కోట్లతో ఎస్టీపీ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే చెరువుల్లోకి మురుగునీరు చేరదని.. తద్వారా చెరువులన్నీ స్వచ్ఛమైననీటితో కళకళలాడుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాముని చెరువు వద్ద స్థల సేకరణకు చర్యలుతీసుకుంటానని హామీనిచ్చారు.

అలాగే ఫతేనగర్‌లోని ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఎస్టీపీకి వెళ్లే రోడ్డు మార్గాన్ని విస్తరించే పనులను చేపట్టాలని అధికారులను కోరారు. మౌలిక వసతుల కల్పన విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అధికారులు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో భారీ మెజార్టీని అందించి.. ఆదరించిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కార్పొరేటర్లు పగుడాల శిరీష, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.


బాలాజీనగర్‌లో ముళ్లకత్వ చెరువు వద్ద ఎస్టీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీషాబాబూరావు, తదితరులు

## డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలి


బాలాజీనగర్ డివిజన్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ శిరీషాబాబూరావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 13 : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ పగుడాల శిరీషా బాబూరావు అన్నారు. బుధవారం బాలాజీనగర్ డివిజన్, కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నం.2లో 450 ఎంఎం డయా పైప్‌లైన్, బాలాజీనగర్ విజయదుర్గా టిఫిన్ సెంటర్ రోడ్డులో 400 ఎంఎం డయా పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ వ్యవస్థలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వైష్ణవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ చౌదరి, స్థానిక నేతలు పవన్‌కుమార్, ఆరోగ్యరెడ్డి, సుభాష్‌గౌడ్, సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, బి.భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి కృషి

ప్రజలందరినీ చల్లగా కాపాడే గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ముఖద్వారములను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో వందల ఏండ్ల చరిత్ర కలిగిన రామాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గ్రామ దేవత చిత్తారమ్మ దేవాలయంలో సకల వసతులు కల్పిస్తూ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తులసీరావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.


చిత్తారమ్మ దేవాలయంలో ముఖద్వారం ప్రారంభోత్సవం పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు

## నాలాల్లో వ్యర్థాలు వేయవద్దు


వరదనీటి కాలువ వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్

మియాపూర్ , మార్చి 13 : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో పరికి చెరువుకు అనుసంధానంగా ఉన్న ఓపెన్ నాలా వరద నీటి కాలువలో సిల్ట్ తొలగింపు పనులను బుధవారం ఏఈ శ్రావణితో కలిసి కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలా పరిసరాల్లో నివసించే ప్రజలు, వాణిజ్య నిర్వాహకులు వ్యర్థాలను నాలాలో వేయవద్దని కోరారు. నాలాల్లో పేరుకున్న సిల్ట్ తొలగింపు పనులను వర్షాకాలానికి ముందే పూర్తిచేసి వరద నీరు సాఫీగా వెళ్లిపోయేలా చర్యలు చేపడతామని కార్పొరేటర్ పేర్కొన్నారు. నాలా విస్తరణతో ధరణినగర్‌ను ముంపు నుంచి కాపాడిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అధికారులు పనులను ఎప్పటికపుడు పర్యవేక్షించి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, శ్రీనివాస్, పాండు, ప్రదీప్ , రవికుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రజకసంఘం ప్రతినిధులు

## రజకుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, మార్చి 13 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దోబీఘాట్‌ల అభివృద్ధితోపాటు రజక సంఘం భవన నిర్మాణాభివృద్ధికి కృషిచేసి, కులవృత్తిని మరింత బలోపేతం చేయాలని రజక సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రజక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కులవృత్తులను బలోపేతం చేసేందుకు కోట్లాది రూపాయలను వెచ్చించారని ఎమ్మెల్యేకు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రజకుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాన వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు మల్లేశ్, సాయిబాబా, శంకర్, సత్యనారాయణ, వెంకటేశ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

మాదాపూర్, మార్చి 13: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ నగర్ కాలనీలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ బిల్లులతో పాటు స్థానిక సమస్యలపై కాలనీ వాసులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఈ వెంకన్న, ఏడీఈ శ్యామ్ ప్రసాద్, ఏఈ ఇంద్రసేనా రెడ్డిలు కాలనీ ప్రతినిధులు నాగరాజు, శ్రీనివాస్, సాంబశివలతో కలిసి హాజరయ్యారు. ఇందులో భాగంగా స్థానికులు కాలనీలో చెట్లు అధికంగా ఉండటంతో పవర్ కండక్టర్లను తీసివేసి.. వాటి స్థానంలో నూతన కేబుల్స్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్‌కు సంబంధించి స్థానికంగా ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే తక్షణమే వాటిని పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.




# కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం..

## ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీతో సాయిరాం కాలనీ వాసులు

మియాపూర్ , మార్చి 13 : కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి..మౌలిక వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నా రు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రభుత్వంతో కొట్లాడైనా నిధులు సమీకరించి డివిజన్ లను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్, సాయిరాం నగర్ కాలనీలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై డివిజన్ పార్టీ అధ్యక్షుడు బాలింగ్ గౌతంగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే గాంధీని కాలనీవాసులు కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల పురోగతి బాధ్యత తనదేనని, ఎప్పటికప్పుడు కాలనీల అవసరాలను తెలుసుకుని వాటిని తీర్చేందుకు నిరంతర కృషి చేస్తాన న్నారు. తమ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ. 9వేల కోట్ల నిధులు వెచ్చించి విస్తృతమైన మౌలిక వసతులు కల్పించామని అన్నారు. కాలనీవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని, సౌకర్యాలు కల్పించి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాండు, బాబు, వెంకటేశ్ , జితేందర్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలువురు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు బుధవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ రాజును పలువురు నేతలు కలిసి అభినందనలు తెలియజేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా రాజును గెలిపించుకుని గులాబీ జెండాను ఎగురవేస్తామన్నారు. అనంతరం వివిధ శుభకార్యాలకు హాజరు కావాలంటూ పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు. – దుండిగల్, మార్చి 13

## సమస్యల పరిష్కారానికి కృషి

అల్లాపూర్,మార్చి13: డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుకొని.. వాటి పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని పద్మావతినగర్ లో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... .నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్పొరేటర్ వెంట అధికారులు, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.


డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించి, వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

## పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం..


ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

మాదాపూర్, మార్చి 13: రానున్న ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం శేరిలింగంపల్లి నుంచి అఖండ మెజార్టీని అందిస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్, కొండాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని, వారికి అండగా ఉంటామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ గౌస్, శేరిలింగంపల్లి కో ఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, మహిపాల్ యాద వ్, టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ నల్లా సంజీవరెడ్డి, ముధు రాజ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వీరేందర్, నాగేశ్ నాయక్, అశోక్, గోపాల్ నాయక్, మునఫ్ ఖాన్, రహీం, ఇస్మాయిల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి..


కమిషనర్ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

దుండిగల్,మార్చి13 : డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ కాకతీయనగర్‌లో గత నాలుగైదు ఏండ్లుగా ఓపెన్ డ్రైనేజీ ప్రవహించడం వల్ల దుర్గంధంతోపాటు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని, ఫలితంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు బుధవారం వారు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కమిషనర్.. సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానికంగా నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రనాయక్, జగ్జీవన్‌రెడ్డి, కాకతీయనగర్ కాలనీ వాసులు, ఎర్రోళ్ల విష్ణు, మార్తమ్మ, వెంకటస్వామి, అడ్వకేట్ మల్లికార్జున్, కిరణ్ కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుందర్ రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మొండి బకాయిదారులపై ఉక్కుపాదం

జూబ్లీహిల్స్,మార్చి13: ఆస్తిపన్ను మొండి బకాయిదారులపై జీహెచ్ఎంసీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను చెల్లింపులలో అలసత్వం వహిస్తున్న వారిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. బుధవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అధికారులు పలు ఆస్తులను సీజ్ చేశారు.

# 'ప్రజాపాలన' లబ్ధిదారుల అవస్థలు..!

- వార్డు కార్యాలయాల్లో సౌకర్యాల లేమితో ఇబ్బందులు
- దరఖాస్తు ఫారాల కోసం పడిగాపులు..
- అధికారుల పనితీరుపై లబ్ధిదారుల మండిపాటు


కుత్బుల్లాపూర్ డివిజన్, పద్మానగర్ ఫేస్-2లోని వార్డు కార్యాలయం వద్ద ఎండలో క్యూలైన్లో వేచి ఉన్న లబ్ధిదారులు

కుత్బుల్లాపూర్, మార్చి 13: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. విడివిడిగా కాకుండా అన్ని సంక్షేమ పథకాలకు ఒక్క దరఖాస్తు ఫారం సరిపోతుందని, అర్హులైన వారు ఏ పథకానికి దరఖాస్తు చేసుకుంటారో అందులో తెలియజేస్తే చాలని చెప్పి ప్రజాపాలన ద్వారా అభయహస్తం దరఖాస్తులను స్వీకరించింది. దీనిలో భాగంగా గృహజ్యోతి పథకం కింద జీరో కరెంటు బిల్లు కోసం ఇప్పటి వరకు అర్హులుగా గుర్తించని లబ్ధిదారుల సంఖ్య అధికంగా ఉండడంతో పాటు రూ.500 గ్యాస్‌సిలిండర్ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు వార్డు కార్యాలయాలకు వెళ్లే లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. ఉదయం 10 గంటలైనా సంబంధిత అధికారులు రాకపోగా... వచ్చిన తర్వాత అభయహస్తం ఫారాలను పూర్తిస్థాయిలో అందించలేని పరిస్థితి నెలకొంటుందని లబ్ధిదారులు మండిపడుతున్నారు. కార్యాలయాల వద్ద కనీస మౌలిక సదుపాయాలైన నీళ్లు, నీడను కల్పించకుండా నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతూ రెండు, మూడు దఫాలుగా ఫారాలు నింపి ఇచ్చినా ఏదో ఒక సాకుతో సిబ్బంది తిరస్కరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడుతున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి, జీడిమెట్ల డివిజన్ , గాయత్రినగర్‌లో ఉన్న వార్డు కార్యాలయంలో సంబంధిత అధికారులు సకాలంలో రాకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు అధికారుల కోసం పడిగాపులు కాచారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు లబ్ధిదారులకు దరఖాస్తు ఫారాలను అందించడంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి.. పకడ్బందీగా అర్హులైన ప్రతి ఒక్కరి వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించి, సకాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలని కోరుతున్నారు.


జీడిమెట్ల డివిజన్, గాయత్రినగర్‌లో వార్డుకార్యాలయం ముందు పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

## 'సాంకేతిక విద్యలో విద్యార్థులు రాణించాలి'

కుత్బుల్లాపూర్, మార్చి 13 : మారిన కాలానికి అనుగుణంగా వచ్చిన నూతన మార్పులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్‌తరాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించాలంటే సాంకేతిక విద్యలో విద్యార్థులు రాణించాలని టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ పీహెచ్.విజయదీప్తి, ఎండీ రమేశ్‌లు అన్నారు. బుధవారం కొంపల్లిలోని శివశివానీ విద్యాసంస్థల నిలయంలో విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికపై ఏర్పాటు చేసిన అర్ధసాచి వెంచర్ చర్చావేదికలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో వారు పాల్గొని ..వారి అనుభవాలను పంచుకున్నారు. మనం అభివృద్ధి చేస్తున్న నైపుణ్యాలను అందిపుచ్చుకునే స్థాయితో ముందుకెళ్తే అభివృద్ధిలో మనదేశం మరింత ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో మరింత ఎదగాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.ఎస్‌వి.రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మూసాపేటలో ఆర్ సీ ట్రెండ్ సెట్టర్స్ ఫ్యాషన్ స్టోర్ ప్రారంభం



నగరంలోని మూసాపేటలో ఆర్‌సీ ట్రెండ్ సెట్టర్స్ క్లాత్ బ్రాండింగ్ ఫ్యాషన్ స్టోర్‌ను బుధవారం స్టోర్ అంబాసిడర్‌గా ఉన్న యంగ్ హీరో ఆకాష్ పూరి.. వ్యవస్థాపకులు రమేశ్, రోమన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ స్టోర్‌లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్నాయి. కాగా.. ఈ క్లాత్ బ్రాండింగ్ ఫ్యాషన్ స్టోర్‌కు అంబాసిడర్‌గా పనిచేయడం సంతోషంగా ఉందని హీరో ఆకాష్ పూరి అన్నారు. యూత్‌ను ఆకట్టుకునేలా ఈ స్టోర్‌లో అన్ని రకాల డిజైన్లు ఉన్నాయని అన్నారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 13 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి.

టమాట రూ.11, వంకాయ రూ.28, బెండకాయ 45, పచ్చి మిర్చి 60, బజ్జి మిర్చి 55, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజి 25, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 28, చిక్కుడు 60, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 60, ఆలుగడ్డ 27, కీరా 23, దోసకాయ 19, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 55, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, చింతకాయ 65, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 9 నుంచి 9, చామగడ్డ 47, ముల్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 17, గుమ్మడికాయ 28, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠానీ 51, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 140, వెల్లుల్లి 180, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

హిమాయత్‌నగర్,మార్చి13: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో ప్రజలు సామరస్యంగా జీవిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలా ంటి చట్టాన్ని తీసుకురావడం సరికాదన్నారు. రాజ్యాంగ, లౌకిక విలువలకు తూట్లు పొడిచేందుకు కేంద్రం పూనుకుంటుందన్నారు. మత, విభజన చట్టాలను ప్రోత్సహించబోమని, మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్న మోదీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు.